# వారధి

## వడ్లమన్నాటి కుటుంబరావు

నేను పచ్చి స్వార్థపరుణ్ణి అని చెప్పుకోటానికి నా కెలాంటి అభ్యంతరమూలేదు. అవును... ఎందుకుండాలి? ఆమాటకొస్తే..... ఈ రోజుల్లో ప్రతి వ్యవహారం.... 'నువ్వు నా కేమిస్తావ్? నీ పని సానుకూలం చెయ్యాలంటే' అనే ప్రాతిపదికమీదే జరుగుతోంది. అందువల్ల లాభం అంటూ లేకుండా నేనెలాంటి పనిలోకి దిగను.

చేసిన పాపం చెపితేపోతుందంటారు. నాలో విశేషమేమంటే.... అవతలివాళ్ళ అసహాయతను..... నిస్సహాయతను అవసరపు వత్తిడిని దృష్టిలో పెట్టుకుని వాళ్ళకి సాధ్యమైనంత ఎక్కువ నష్టాన్ని కలుగజేసి.... నాకు వీలైనంత లాభాన్ని కలిగించేదిగా వ్యవహారాన్ని మలుచుకుంటాను.

ఉదాహరణకి....

మా ఎదురింటాయన మనవడికి చాలా సుస్తీ చేసింది. వైద్యానికి ఆయనదగ్గరున్న డబ్బు చాలలేదు. కొడుకు ఏక్కడో దూరప్రాంతంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన కోడలు.... తన కొడుకు పరిస్థితికి ఏడ్చి శోకాలుపెడుతున్నది.

నా సంగతి తెలిసుండి కూడా ఆయన సగంచచ్చి నన్ను అయిదు వందల రూపాయలు అప్పు అడిగాడు.

నేను యిస్తానన్నాను. ఆయన నమ్మలేనట్టు.... సూర్యుడు పడిమట ఉదయిస్తాడా అన్నట్టు... చూశాడు నాకేసి.

"ఇస్తానయ్యా! అయితే ఒక షరతు" అన్నాను.

ఏమిటన్నట్టు చూశాడు.

"మీ యింట్లో వున్న 'నేషనల్ పానోసోనిక్ మోనో టేప్‌రికార్డర్' నా కిచ్చెయ్యాలి అచ్చంగా!" అన్నాను అదోలా నవ్వుతూ.

ఆయన నిర్ఘాంతపోయాడు. అయిదువందల రూపాయల అప్పుకోసం.... దాదాపు పన్నెండొందల రూపాయల ఖరీదుచేసే టేప్‌రికార్డర్ ధారాదత్తమా! అన్నట్టు దీనంగా ముఖంపెట్టాడు.

"మీ మనవడి ప్రాణం కన్నా ఖ్నడీ టేప్‌రికార్డర్ ఎక్కువటయ్యా?" అంటూ ఆయన మనసులోని సున్నితభాగంమీద సమ్మెటదెబ్బకొట్టాను.

అంతే! గెలుపు నాదే అయింది... హె!

మా పక్కింటాయన ఉద్యోగరీత్యా ఢిల్లీ వెళ్ళి అక్కడే సెటిలయిపోయాడు. పిత్రార్జితమైన అతని యింటిని అమ్మాలని చూస్తున్నాడని తెలిసి.... నేను ఆ యిల్లు మంచిది కాదని, రాత్రిపూట ఆ యింట్లో నుంచి వింతశబ్దాలు..... వికృతమైన ధ్వనులు వినిపిస్తుంటాయని..... యింతవరకూ ఆ యింట్లో అద్దెకి దిగినవాళ్ళు.... ఖాళీచేసి వెళ్ళేప్పుడు ఒకరు మైనస్‌గా వెడుతుంటారని పుకారులేవదీశాను. అంతేకాదు... ఆ యిల్లు కొంటానికెవరన్నా పార్టీ వస్తే.... కిరాయి మనుష్యులను పెట్టించి.... చాటుమాటుగా ఆ వికృతధ్వనులను చేయిస్తుండే వాడిని.

ఢిల్లీ నుంచి వచ్చిన యిల్లుగలాయన ఆయన చెవులను ఆయనే నమ్మలేనట్టుగా బెంబేలెత్తిపోయాడు. ఎలాగైనా తన యిల్లు అమ్మిపెట్టమని నన్ను ప్రాధేయపడ్డాడు.

"పాతికవేలు రెడీ కాష్ స్టడీగా నీ చేతిలో పెడతాను.. .. యిల్లు నాకు రిజిష్టర్ చెయ్యి!" అన్నాను దర్పంగా.

"అన్యాయం! లక్షన్నర ఖరీదుచేసే యిల్లు.... నీకు పాతికవేలకే యివ్వాలా?" అన్నాడు దాదాపు ఏడుస్తున్నట్టుగా.

"ఈ దెయ్యాల కొంపకి యింకోళ్ళయితే అదికూడా యివ్వరు! ఆపైన నీ యిష్టం" అన్నాను బెట్టుగా.... పట్టు సడలకుండా.

అంతే! ఆయన యిల్లు పాతికవేలకు నాకు గోవిందా హరీ! అయింది.

మా వీధిలో ఒక్క వితంతువుండేది. ఆమె కొడుకుని బి. టెక్. చదివించటానికి ఒక్కసారిగా చాలా డబ్బు అవసరమైంది. ఎంతో కొంత డబ్బుయితే యిచ్చేవాళ్ళు చాలామంది వున్నారుగానీ..... ఒక్కసారిగా గడువులోపల ఆమె క్కావలసిన మొత్తాన్ని యివ్వగలిగిన వాణ్ణి నేనొక్కణ్ణే! ఆమె నిస్సహాయతని అదనుగా తీసుకుని ఆమె యిచ్చిన బంగారానికి అతి తక్కువ మొత్తాన్ని ముట్టజెప్పాను. తెలివంటే నాదేకదూ?!

నాకు బాగా పరిచయం వున్న ఒకాయన కూతురిపెళ్ళికని యిల్లు తాకట్టుపెట్టి కొంతసైకం అప్పు తీసుకోటానికిరాగా.... అతనికి హితోపదేశం చేసి.... "కూతురి పెళ్ళికన్నా యింకా దేనికయ్యా నువ్వు ఘనంగా ఖర్చుపెట్టగలిగేది?" అంటూ నచ్చజెప్పి.... అతని తీర్చగలిగిన ఆదాయంకన్నా చాలా ఎక్కువమొత్తం అప్పుగా ముట్టజెప్పాను. పాపం! అతను గడువులోపల ఆ అప్పు తీర్చలేక పోయాడు. ఇంకేముంది? ఆ భవనం.... ఆసాంతం.... నా సొంతం!

ఇలా నీటుగా చెప్పుకుంటూపోతే నా స్వార్థానికి గీటురాళ్ళనదగిన సంఘటనలు నా జీవితంలో ఎన్నో ఉన్నయ్!

ఇంతకీ అసలువిషయం ఏమిటంటే.... నా స్వార్థం.... నా జన్మహక్కు! కానీ పాపం మధుసూదనం. పూర్‌ఫెలో!

కానీ..... మధుసూదనం నా మిత్రుడు! "నీ కెందుకయ్యా మగడా....., మధుసూదనం ఎటుపోతె నీ కేమిటి?" అని అన్నారో మీ రొట్టె పిచ్చివాళ్ళన్న మాట!

దీనికో ముందుమాట!

ఉన్నట్టుండి ఓ అర్ధరాత్రి మీ పక్కింటివాడి సిరిఎత్తుకుంటుంది అనుకోండి! వెంటనే వాడు ఓ అందమైన బిల్డింగ్ కట్టేస్తాడు.

అధునికమైన సామగ్రి కొనుగోలుచేస్తాడు!

కారు మెయిన్‌టెయిన్‌చేస్తాడు!

సర్వభోగాలూ అనుభవిస్తాడు! అప్పుడు మీరు చూస్తూ వూరుకోగలరా? మనకెందుకులే అని...

మనసు అసూయతో నిండిపోదూ?

కళ్ళు ఈర్ష్యతో మండిపోవూ?

నా మనస్తత్వంకూడా ఈ కోవకు చెందిందే!

నా స్నేహితుడు మధుసూదనం గాడికి ఇంత మంచిపేరా? నన్నేమో అంతా ఛీకొడతారా? డామిట్..... డా..... మ్...... ఇట్!

మధుసూదనంగాడి జీవితాన్ని తరచిచూసి... వాడి జీవితంలోని చీకటి ద్వారాల్ని తెరిచివేసి.... వాడి లొసుగుల్ని బయటపెట్టి, వాడి ముఖంమీద జనంచేత పేడనీళ్ళు కొట్టించకపోతే.... నేను... మ.... ని.... షి.... నే..... కాను. హె! (ప్రస్తుతానికి నేను మనిషినేకదూ?).

మంచిపనులకు నా మనస్సురాదు గానీ... యిలాంటి చెడ్డపనులకు మాత్రం అది వురుకులు పరుగులు తీస్తుంటూంది.... చిత్రం!

నా వేటలో మొదటగా మధుసూదనం ఉద్యోగం యిప్పించిన కుర్రవాడి దగ్గరకెళ్ళి... "మధుసూదనంగాడికి ఎంత లంచం యిచ్చావ్?" అని బెదిరించాను.

"మా ఆర్థికపరిస్థితికి జాలిపడి ఆ మధుసూదనం బాబుగారు.... ఈ ఉద్యోగం యిప్పించారు. ఆయన



మా యింటి దేముడు. యిది నిజం!" అన్నాడు వాడు. నేను పదేపదే బెదిరించినా కూడా. లాభంలేకపోయే సరికి తోకముడిచాను అక్కడినుంచి.

సొంతయిల్లు కట్టుకున్న ఒకతనికి.... మధుసూదనం చాలా డబ్బు సాయంచేశాడని తెలుసుకుని.... అతనిదగ్గర కెళ్ళి వాలాను. అతని భార్య అందంగా వుంటుందని.... అమెను మధుసూదనం పక్కన పడుకోపెట్టి వుంటాడని వూహించి బ్లాక్‌మెయిల్ చేద్దామనుకున్నాను. ఆరూపేణా ఆ అందాన్ని నేనుకూడా ఆస్వాదించుదా మనుకున్నా.

రాక్షసిబొగ్గులాంటి అతని ధర్మపత్నిని చూసి మూర్ఛవచ్చినంతపనయ్యింది నాకు. "వడ్డీలేని అప్పు యిచ్చి నా కొంపని నిలబెట్టాడు ఆ మధుసూదనం బాబు! దేవుడంటూ ఎక్కడో లేడు. ఆయనలోనే వున్నాడని" చేతులు జోడించాడు అతను.

నేను మూతి బిగించి కోపంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాను.... హతాశుడనై.

కృత్రిమమైన కాళ్ళు అమర్చేందుకు ఆర్థిక సహాయంచేశాడని ఒకడు. అగిపోయే కూతురి పెళ్ళికి ధనసాయం చేశాడని ఒకడు... అప్పులపాలై కుటుంబం యావత్తూ ఆత్మహత్యకు పాలుపడి పోతుంటే.... ఆదుకున్నాడని ఒకడు... అతన్ని... అదే.... మధుసూదనాన్ని దేముడు అంటూ పొగుడుతుంటే.... నేను లోలోపలే భగ్గుమని మండిపోయాను.

ఎలాంటి వ్యసనాలూలేని మధుసూదనం.... ప్రతిఫలాపేక్షలేకుండా.... యిలాంటి మంచిపను లెందుకు చేస్తున్నట్టు?

కీర్తి కండూతికా?

పిచ్చిసన్నాసి!

అవి కందువాపెట్టి ముఖం తుడుచుకోటానికి కూడా పనికిరావు.

ఒకవేళ ఉత్తరోత్తరా రాజకీయ నాయకుడవుదా మనే దురుద్దేశంగాని వుందా? 'అప్పనంగా లక్షలు సంపాయించాలంటే ఇంతకుమించిన అయుధమే ముంది మన ప్రజాస్వామ్య దేశంలో....!' అనుకున్నాను.

వాళ్ళూ.... వీళ్ళూ అనుకుంటుండగా విన్నాను. మధుసూదనం.... రాజకీయాలకు బహుదూరం అని.

మరైతే ఎందు కీ నిస్వార్థసేవ? ఎవర్ని ఉద్ధరించటానికి?

సమాధానం రాక.... రాబట్టలేక నా కడుపుబ్బిపోతోంది!

ఇక లాభంలేదు..... ఈ ప్రసవవేదన నేను భరించలేను... ఎవర్నో ఎందుకూ? మధుసూదనాన్నే డైరెక్టుగా అడిగేస్తేపోలా? అనుకున్నాడు.

వెంటనే అతని యింటిముంగిటవాలాను.

"ఇదుగో మధుసూదనం నీ వరస నా కేమీ నచ్చలేదు. ఇలాగనక నువ్వు చెయ్యటం మానకపోతే



నీకు చెప్పేగతిస్కీ" అంటూ రెండుమూడు పర్యాయాలు మందలించాను. కానీ... మధుసూదనం నవ్వి వూరుకున్నాడు. ఆ నవ్వుతో నన్ను వెర్రివాణ్ణిగా చేస్తున్నాడో... లేక తను వెర్రివాడన్న విషయం నేను గ్రహించాననుకుని సిగ్గుపడుతున్నాడో నాకసలు అర్థంకాలేదు.

కానీ... కొన్ని రోజులకు నన్ను ఒక్కకుదుపుకుదిపి వేసి.... మొదలంటా నరికివేసిన ఘోరసంఘటన ఒకటి జరిగింది.

మధుసూదనం కొడుకు చాలా బావుంటాడు.

మా అమ్మాయి ఒకమాదిరిగా వుంటుంది.

ఎలా కలిసిందో ఏమో? ఈ యిద్దరికీ జతకుదిరింది.

ఈ విషయం... మా అమ్మాయి భోళుక్కున వాష్‌బేసిన్‌లో కక్కుకునే వరకూ నాకు తెలియనేలేదు. దాన్ని చావచితక్కొట్టానేగానీ.... అది నెల తప్పిందన్న తప్పుదాన్ని తప్పించలేనుకదా!

మధుసూదనం కొడుకు దగ్గరకువెళ్ళి నిలదీసి అడిగితే "మీ అమ్మాయికి నెల నేనే తప్పించానని రుజువేమిటి?" అన్నాడు వెటకారంగా.

'ఒరి పుండాకోర్!' అనుకున్నాను పుండుమీద కారంజల్లినంతకోపంగా!

ఇక నాకు మధుసూదనమే గతిఅయ్యాడు.

అతనికాళ్ళు పట్టుకుంటాను. అడిగినంత కట్నం యిస్తాను. అంతగా కావాలంటే నా అక్రమార్జితమైన యావదాస్తీ రాసి యిచ్చేస్తాను. నా కూతురి జీవితం బాగుపడటంకన్నా నా కింకేంకావాలి? అనుకున్నాను.

గుడ్ల నీరుకక్కుకుంటూ.... నా దీనగాథను మధుసూదనానికి విన్నవించుకున్నాను. సాయం చెయ్యమని ప్రాధేయపడ్డాను. ఇవి చేతులు కావు కాళ్ళనుకోమని వేడుకున్నాను.

అతను ఒప్పుకుంటాడో లేదోనని బిక్కుబిక్కుమంటూ అతని నిర్ణయానికై ఎదురు చూస్తున్నాను ఆశగా..... ఆతృతగా.... భయంగా!

కానీ ఆ... శ్చ... ర్య...ం! నా ముందే వాళ్ళబ్బాయిని గట్టిగా కూకలేశాడు. "ఒక కన్నెపిల్ల గొంతు కొయ్యటానికి సిగ్గులేదట్రా నీకు.... కట్టు.... ఆ అమ్మాయి మెళ్ళో మంగళసూత్రం" అన్నాడు ఆజ్ఞాపిస్తూ.

ఈసారి నేను మరింత ఆశ్చర్యపోయాను. నేనిదే అడిగితే అవమానపరచిన మధుసూదనం పుత్రరత్నం కిక్కురుమనకుండా ఒప్పుకున్నాడు. నీతిముందు అవినీతి తలవంచడమంటే యిదేనేమో?!

ఆ క్షణంలో మధుసూదనం పాదాల దగ్గర తల భళ్ళున పగలకొట్టుకోవాలనిపించింది నాకు. నా కన్నీటితో అతని పాదాలకు అభిషేకం చెయ్యాలనిపించింది.

అతనికి పదేపదే కృతజ్ఞతలు చెప్పుకుని నా యావదాస్థినీ.... అమ్మాయికి పసుపుకుంకుమ కిందయిచ్చేసి.... అతని కొడుకుతో మా అమ్మాయి పెళ్ళి వైభవంగాగా జరిపించాను.

ఇప్పుడు నేను బికారిగా మారిపోయినా.... కెంతో ఆత్మసంతృప్తిగావుంది.

ఒకరోజు తీరికగా కూర్చున్నప్పుడు మధుసూదనాన్ని అడిగాను... నిష్కామంగా మీరు చేసే సాయాలకు అర్థమేమిటని?

వేదాంతిలా ఎటో చూస్తూ అస్పష్టంగా గొణిగాడు మధుసూదనం.

"ఈ సిరిసంపదలు అశాశ్వతాలు. ఇవి మనతోటి రావు. పార్థివశరీరం కట్టెలా బిగుసుక పోయినప్పుడు... మనం చేసిన మంచిపనులే పుణ్యరూపంలో.... మన సూక్ష్మశరీరంతో పాటు ప్రయాణంచేస్తూ వస్తాయట... అని మహామహులు ఎన్నోచోట్ల ఉదహరించారు."

మధుసూదనం మనిషికాదు.... లౌకిక.... అలౌకిక లోకాలకు వారధిలాంటి మహోన్నత వ్యక్తి అనిపించింది నాకు. □


# కేశవర్ధిని...
## పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




OBM 8473 TG

**కేశవర్ధిని**
**తలనూనె**

కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092